ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 18 | సంచిక : 01 | సెప్టెంబర్ 2012

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 16

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు ......... 21-06-2012

జిన్నూరు ......... 29-07-2012

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-06-2012, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పూరీని పురుషోత్తమక్షేత్రం అంటారు. పురుషోత్తముడు అంటే భగవంతుడు. పూరీలో జగన్నాధుడు, జగన్నాధుడు అన్నగారు బలభద్రుడు, జగన్నాధుడు చెల్లెలు సుభద్ర, వీళ్ళు ముగ్గురూ అక్కడ మనకి దర్శనం ఇస్తారు. ఈ ముగ్గురినీ ఇక్కడ రథాలలో ఊరేగిస్తారు. చాలా ప్రాంతాలలో రధోత్సవాలు ఉన్నా ఈ రధోత్సవాలలో పూరీకి ప్రపంచ ప్రఖ్యాతి వచ్చింది. ఈ మూడు విగ్రహాలు రాళ్ళతో చేసినవికావు. పెద్ద టేకు కఱ్ఱలాంటి కఱ్ఱ పన్నెండు సంవత్సరాలకి ఒకసారి సముద్రంలో కొట్టుకు వస్తుంది. ఆ కఱ్ఱతో విగ్రహాలు తయారుచేస్తారు. మళ్ళీ 12 సంవత్సరాలకి ఆ విగ్రహాలని భూస్థాపితం చేసేసి మళ్ళీ కొత్త విగ్రహాలను పెడతారు. పూరీలో శంకరాచార్యులవారు, రామానుజాచార్యులవారు, శ్రీకృష్ణ చైతన్య మఠాలు స్థాపించారు. అక్కడ శివకేశవ భేదం లేదు. పురుషోత్తముడు అంటే జగత్తుకీ, జీవకోటికీ అతీతంగా ఉండి ఈ పంచభూతాలని, జీవకోటిని నియమించేవాడిని పురుషోత్తముడు అంటారు.

మన దేహానికి ఆహారం ఎటువంటిదో, దేహగతమైన నేనుకి ఇతర తలంపులు అటువంటివి. నేను అనే తలంపుని మొదటి తలంపు అంటారు. మీకు విషయాలు వచ్చినా ఈ నేను అనే తలంపుకే వస్తాయి. మొదటి తలంపుకే ఇతర తలంపులు వస్తాయి. అందుచేత ఈ నేనుపోతే ఇంక ఇతర తలంపులు లేవు. ఈ నేను ఉన్నంతకాలం ఇతర తలంపులు వస్తూ ఉంటాయి. రమణమహర్షిగారు ఏమన్నారు అంటే దేహగతమైన నేను ఉంటే జగత్తు ఉంది, జీవుడు ఉన్నాడు, చావులు, పుట్టుకలు ఉన్నాయి, కామక్రోధాలు ఉన్నాయి, సంతోషాలు ఉన్నాయి. ఈ సృష్టి అంతా నేను అనే ఒంటి స్థంభం మీద ఆధారపడి ఉంది. దేహగతమైన నేను కేవలం కల్పితం. అది నిజంకాదు. ఆ కల్పించబడిన నేనుని కనుక

మనం తొలగించ గలిగితే నీ హృదయంలో ఉన్న నిజం నీకు గోచరమవుతుంది. అది నీకు గోచరించిన తరువాత ఈ ప్రకృతి గుణాలని దాటి వెళ్ళిపోతావు. మీరు ఏ మార్గాన్ని అవలంబించినా ఈ ప్రకృతి గుణాలని దాటి వెళ్ళాలి. సత్వగుణం, రజోగుణం, తమోగుణం ఇవే మాయ. ఇదే ప్రకృతి. దేహగతమైన నేనుని మనం ఓవర్‌కం చేస్తే ఈ నేనుని పట్టుకుని ఉన్న ప్రకృతి గుణాలు కూడా రాలిపోతాయి. నువ్వు సాధన చేసి ఆ నేను నిజంకాదని ఎప్పుడైతే తెలుసుకున్నావో, ఆ నేను కల్పితం అనేటువంటి అనుభవం నీకు వస్తే నీకు చావులు లేవు, పుట్టుకలు లేవు, రాగద్వేషాలు లేవు, సంతోషం లేదు, దుఃఖం లేదు అన్నారు.

**శనైః శనై రుపరమే ద్బుద్ధ్యా ధృతి గృహీతయా,**
**ఆత్మ సంస్థం మనః కృత్వా నకించిదపి చిన్తయేత్ (గీత 6-25)**

మన మనస్సు ఏ విషయాలమీదకి వెళుతోందో చూసుకుని ఆ విషయం మీద నుంచి మనస్సుని నెమ్మది, నెమ్మదిగా స్లోగా, స్టడీగా, ధైర్యంగా, జాగ్రత్తగా ఉపసంహరించి భగవంతుడియందు మనస్సును స్థిరముగ నిల్పుకుని ఇతర విషయములు దేనిని చింతింపక ఉండవలయును అని పరమాత్మ చెబుతున్నాడు మీ మనస్సుని నామీదే నిలబెట్టి ఉంచండి, నన్ను ప్రేమించండి, నన్ను అర్చించండి, నన్ను పూజించండి, నాకోసం పనిచేయండి అన్నాడు. కొంతమంది నోటితోటి స్తోత్రాలు తక్కువగా చేసినా, చేతులతోటి ఈశ్వరుడి కోసం ఎక్కువగా పని చేస్తారు. మీరు నిజంగా ఈశ్వరుడికోసం పని చేస్తూ ఉంటే అసలు మీకు గుర్తింపులు గొడవే ఉండదు. కొంతమంది విపరీతమైన స్వార్థపరులు ఉంటారు. వారు ఎప్పుడూ దేహగతమైననేను చుట్టూ తిరుగుతూ ఉంటారు కాని ఆ వలయం దాటి దేవుడిని ప్రేమించరు. కొంతమందికి అసలు ఆప్యాయత ఉండదు. ఆప్యాయత లేని మనిషి దేవుడిని ఎలా ప్రేమిస్తాడు. భగవద్గీత చదివేస్తే దేవుడిని ప్రేమించవచ్చు అనుకుంటున్నారా? పండితులు వేదాలు చదువుతున్నారు. వాళ్ళకి భగవంతుడి మీద ఎంత ప్రేమ ఉంది. అసలు మన స్వభావంలో ఆప్యాయత ఏమైనా ఉందా? ఆప్యాయత లేని వాడికి ప్రేమ ఎక్కడనుంచి వస్తుంది. మనం పుస్తకాలు చదవటం వలన ప్రేమరాదు. అది స్వభావాన్ని బట్టి వస్తుంది. ప్రహ్లాదుడికి భగవంతుడిపట్ల విపరీతమైన ప్రేమ. ఆ ప్రేమ పుస్తకాలు చదవటం వలన రాలేదు. స్వాభావికంగా వచ్చింది.

మనకి ప్రేమలు ఉన్నాయి అనుకుంటున్నాం. మనం ఏదైనా ప్రయోజనం ఆశించి ప్రేమిస్తూ ఉంటే అది ప్రేమ ఎలా అవుతుంది? అది వ్యాపారం అవుతుంది. చాలామంది వాళ్ళ కోరికలు నెరవేర్చుకోవటానికి నన్ను ప్రార్థిస్తారు. వాళ్ళు కూడా భక్తులే, కానీ నేను కల్పించిన వస్తువులమీద కాకుండా నన్నే ప్రేమించే వాళ్ళు బహుతక్కువమంది ఉంటారు అని పరమాత్మ అన్నాడు. మాయ ఎక్కడ ఉంది? విషయాలలో ఉంది. ఒకో ఇంద్రియానికి ఒకో విషయం ఉంటుంది. ఆ విషయంలో నుండి ఆ ఇంద్రియాన్ని ఉపసంహరించి, మనస్సుని

ఉపసంహరించి నీ మనస్సుని నామీద నిలబెడితే నీకు విషయాల మీద ఉన్న ఆకర్షణ నెమ్మదిగా తగ్గిపోతుంది. అది ఒకే రోజున తగ్గదు. మనకి ఈ బలహీనతలు కొన్ని వందల జన్మలనుంచి వస్తున్నాయి. ఇవాళ సడన్‌గా పొమ్మంటే పోవు. మనం భగవంతుడిని స్మరించగా, స్మరించగా స్వార్థం లేకుండా ఎంతోకొంత సమాజానికి ఉపయోగపడుతూ ఉంటే మన బలహీనతలు తగ్గుతాయి. మనం భౌతికంగా అభివృద్ధిలోనికి రావాలన్నా, ఆధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రావాలన్నా మనస్సుకి శాంతి అవసరం, శరీరానికి ఆరోగ్యం అవసరం. దేహం కూడా మనోకల్పితమే. నీ మనస్సులోనికి ఏ గుణం వచ్చినా అది దేహం మీద ప్రతిబింబిస్తుంది. మీరు నన్ను చూచి అసూయ పడుతున్నారు అనుకోండి, నేను మీ ముఖం వంక చూస్తే తెలిసిపోతుంది. మీరు శాంతిగా ఉన్నారా? అశాంతిగా ఉన్నారా? అని మీ ముఖం వంకచూస్తే తెలిసిపోతుంది. మీరు ఎవరినైనా ద్వేషిస్తూ ఉంటే మీ కళ్ళు చెప్పేస్తాయి. ఫేస్ ఈజ్‌ది ఇండెక్స్ ఆఫ్ ద మైండ్ అంటారు. నా హృదయంలో ఏముందో నాకు తెలిస్తే మీ హృదయంలో ఏముందో నాకు సహజంగా తెలుస్తుంది. రామకృష్ణ పరమహంసగారిదగ్గరకు వెళ్ళి కూర్చుంటే మన హృదయాన్ని పుస్తకం చదివినట్టు చదివేస్తాడు. నువ్వు మంచివాడవో, చెడ్డవాడవో ఆయనకు చెప్పనక్కరలేదు. నీకు ఏ విషయాలమీద కాంక్ష ఉంది? ప్రయత్నం చేసినా వాడు గుణాలని దాటగలడా? దాటలేడా? వాడి పూర్వ జన్మలు ఏంటి? రాబోయే జన్మలు ఎటువంటి జన్మలు వస్తాయి? అని ఒక బుక్కు చదివినట్టు చదివేయగలడు. ఇవి అన్నీ మీకు ఎలా తెలుస్తాయి అని అడిగితే దూళ్ళబేరగాడికి ఆ దూడ ఎటువంటిదో ఎవరైనా చెప్తారా దూడని చూచినవెంటనే ఆ బేరగాడికి ఎలా తెలుస్తుందో అలాగే మనిషిని చూచిన వెంటనే నాకు తెలిసిపోతుంది అన్నారు.

నిన్ను నువ్వు తెలుసుకోమంటే నీకు ఆధారంగా ఉన్నది చైతన్యమే. దానిని తెలుసుకోమని అర్థం. ఇతరుల గురించి తెలుసుకోవటం బుద్ధిపరమైనది. అది బుద్ధికే సంబంధం. కానీ నీ హృదయంలో చైతన్యం దేహానికీ, ఇంద్రియాలకీ, మనస్సుకీ, బుద్ధికీ అతీతంగా ఉంది. అది సూక్ష్మంగా ఉంటుంది. నీ ఇంద్రియాలకీ, మనస్సుకీ, బుద్ధికీ అది అందదు. ఎవడైతే తనని తాను తెలుసుకుంటాడో వాడికి అంతా తెలియబడుతుంది. ఆ వస్తువు తెలిశాక మనం చూడటానికి కాని, వినటానికి కాని ఏమీ ఉండదు. ప్రకృతి గుణాలు దాటకుండా ఎవడికి బ్రాహ్మీస్థితి కలగదు. నీకు బ్రాహ్మీస్థితి రావాలంటే నువ్వు కోరికలను తగ్గించుకో, వ్యక్తీభావన తగ్గించుకో, మమకారం తగ్గించుకో. అప్పుడు నీకు నెమ్మదిగా బ్రాహ్మీస్థితి కలుగుతుంది. ముముక్షత్వం కనుక మీకు ఉంటే, జ్ఞానం సంపాదించాలి అనే కోరిక బలంగా కనుక మీకు ఉంటే వంద సంవత్సరాలు వయసు వచ్చినా 30 సంవత్సరాలులా ఉంటారు. 30 సంవత్సరాలు వాళ్ళు ఎలా సాధన చేయగలరో మీకు వందసంవత్సరాలు వచ్చినా అలా సాధన చేయగలరు. ఏపని చేయటానికి అయినా చాలా ధైర్యం ఉండాలి.

అలెగ్జాండరు ప్రపంచాన్ని జయించాడు. నువ్వు ప్రపంచాన్ని జయించావు నీ తండ్రి ఏమైనా ఆస్థి ఇచ్చాడా అంటే, ఆస్థి ఇవ్వలేదు. ధైర్యంగా ఎలా ఉండాలో నేర్పాడు, హద్దులు లేని ధైర్యాన్ని నా తండ్రి ఇచ్చాడు అని అలెగ్జాండరు చెప్పాడు. ప్రతీ దానికి భయపడేవాడు దేనిని సాధించలేడు.

విషయాలలో నుండి మనస్సుని వెనక్కి తీయటానికి కొంచెం ధైర్యం ఉండాలి. ఎంతో కాలంనుండి నువ్వు విషయచింతనకి అలవాటు పడ్డావుకదా. ఆ విషయచింతనలో నుండి మనస్సుని మార్చి దైవచింతనలోకి తీసుకురావటానికి ధైర్యం ఉండాలి, శక్తి ఉండాలి, అవసరమైతే స్వతంత్రమైన నిర్ణయాలు తీసుకోవాలి. మనస్సు ఆలోచిస్తుంది, బుద్ధి నిర్ణయిస్తుంది. మన ప్రవర్తన ఎలా ఉండాలో నిర్ణయించుకునే శక్తి మన బుద్ధికి ఉంది. ఆ నిర్ణయం తీసుకునేటప్పుడు మన బుద్ధికి ధైర్యం ఉండాలి. ఆ ధైర్యం లేకపోతే నువ్వు ఒక నిర్ణయానికి రాలేవు. నీ బుద్ధిలో ధైర్యం పెట్టుకొని ఆ బుద్ధి ద్వారా విషయచింతనలోంచి మనస్సుని ఉపసంహరించి నాయందు స్థిరపరచు అన్నాడు పరమాత్మ. ఆత్మచింతన కష్టం. ఆత్మకి రూపం లేదు, నామం లేదు. మనకి రూపబుద్ధి, నామబుద్ధి ఉంది కదా అందుచేత మీ ఇష్టదైవాన్ని స్మరించుకున్నా మనస్సు విషయాలలోంచి ఉపసంహరింపబడుతుంది. ఆయన పట్ల మనకి భక్తి ఎలా కలుగుతుందో పరమాత్మ చెప్పాడు. మన్మనాభవః అంటే కాన్‌స్టెంట్‌గా నాయందే మనస్సుని నిలబెడుతూ ఉంటే నాయందు నీకు భక్తి కలుగుతుంది అన్నాడు. మీరు ఇంట్లో వాళ్ళకి సంబంధించిన డ్యూటీ చేస్తూ ఉన్నా మీ మనస్సుమటుకు ఈశ్వర పాదాలమీద ఉండాలి. ఈశ్వరుడికి నమస్కరించగా, నమస్కరించగా ఆయనను పూజించగా, పూజించగా, ఆయనకి ప్రీతికరమైన పనులు చెయ్యగా, చెయ్యగా నెమ్మదిగా మీకు ఆయన పట్ల భక్తి కలుగుతుంది. మనస్సులో నిరంతరం ఆయనను స్మరించుకుంటూ ఉండాలి. మన ఇంద్రియాలన్నింటినీ కూడా భగవంతుడి కోసమే ఉపయోగించాలి. భగవంతుడి కోసమే ఉపయోగిస్తూ ఉంటే నెమ్మదిగా విషయచింతన తగ్గిపోతుంది. చేతులతో పూజిస్తాము, నోటితో జపం చేస్తాము. మనస్సుతో ధ్యానం చేస్తాము. ఇవన్నీ దేనికంటే మన వ్యక్తిభావన తగ్గించుకోవటానికే. భగవంతుడి మీద మన మనస్సు నిలబెట్టడం, స్వార్థం లేకుండా ఈశ్వరుడిని ప్రేమించటం, స్వార్థం లేకుండా ఈశ్వరుడికోసం పనిచేయటం నేను చెప్పినంత తేలికకాదు. మీరు విన్నంత తేలికకాదు. దానికి చాలా ప్రయత్నం ఉండాలి.

మన జీవితంలో స్వార్థం లేకుండా పని పని కోసమే ఎన్ని పనులు చేసాం అని మీరు ఒక్కసారి చూసుకోండి. స్వార్థం లేకుండా పనిచేయటం చాలా కష్టం. మీరు స్వార్థం లేకుండా ఒకపని చేయకలిగితే అప్పుడు అందులో ఉన్న కష్టం మీకు తెలుస్తుంది. దిగితేనేగాని లోతు తెలియదు. కామ్యకర్మలు చేయటం తేలిక, నిష్కామకర్మలు చేయటం కష్టం అని పరమాత్మ అన్నాడు. మీరు ఏదైనా పని ప్రచారం కోసం చేస్తే భగవదనుగ్రహానికి మీరు

పాత్రులు కారు. మీరు అసలు పని ఎందుకు చేస్తున్నారు? మీకు గొప్పలు కావాలి, గుర్తింపులు కావాలి. అందుకే బతుకుతున్నారు. ఇంట్లో వాళ్ళు కూడా గుర్తింపులు కోరుకుంటారు. మనం గుర్తింపులకోసం పనిచేస్తున్నాం అనుకోండి ఆత్మభావనరాదు, దేహభావన పెరిగిపోతుంది. మీ ప్రవర్తనా విధానం మార్చుకోండి. మీరు మాట్లాడుతున్నారు, దేనికోసం మాట్లాడుతున్నారు. అవసరం ఉండి మాట్లాడుతున్నారా? మీ అహంభావన వ్యక్తం చేయటానికి మాట్లాడుతున్నారా? మీరు పనిచేస్తున్నారు, దేనికోసం పనిచేస్తున్నారు. మనల్ని మనం మరచిపోయి ఎన్ని పనులు మనం చేయగలుగుతున్నాం. మనల్ని మనం మర్చిపోయి మనం ఏ పనీ చేయటంలేదు. నీ అహంకారం బాగా బలవటంకోసం నువ్వు పని చేసుకుంటున్నావు కాని దైవానుగ్రహం పొందటం కోసం పని చేయటం లేదు. ఆధ్యాత్మికంగా మీరు అభివృద్ధిలోనికి రావాలంటే నీ బుద్ధితోటి నువ్వే నిర్ణయించుకుని ధైర్యంగా ఉండి నిన్ను నువ్వు బాగు చేసుకోవటానికి ప్రయత్నం చేస్తే దైవసహాయం కలుగుతుంది. అంటే నువ్వు చేస్తున్న ప్రయత్నమే దేవుని సహాయంగా మారిపోతుంది. మిమ్మల్ని ఎవరైనా చిన్నమాట అంటే అవమానం భరించలేరు. నన్ను ఎవడూ ఇంతవరకూ ప్రపంచంలో అవమానం చేయలేక పోయాడు అని గాంధీగారు అన్నారు. ఎందుచేతనంటే ఆ అవమానం నేను అంగీకరిస్తే కదా అన్నారు. ఎదుటివాళ్ళు అవమానం చేయటానికి ప్రయత్నం చేస్తే, నేను అవమానం పడితే అంతకంటే విషం తాగటం మంచిది అన్నారు. నువ్వు ఇతరుల్ని ద్వేషిస్తూ ఉంటే నువ్వు విషం తాగుతున్నావని నీకు తెలియదు. ద్వేషం విషంతో సమానం. ఇతరులను ద్వేషించటం వలన నీ మనస్సు నెమ్మదిగా పొల్యూట్ అయిపోతుంది.

పూర్వజన్మలలో మనిషి చేసిన కర్మల యొక్క ప్రభావమే విధి అంటారు. ఇంతమందిని చంపేసిన తరువాత మాకు ఎందుకు ఈ రాజ్యాలూ, ఈ పరిపాలన అని ధర్మరాజు భీష్ముడితోటి అన్నాడు. దానినే విధి అంటారు అని భీష్ముడు చెప్పాడు. ఆ విధి నీకు ముందు తెలిసింది అనుకో అది విధి ఎలా అవుతుంది. దీనిని షేక్స్‌పియర్ ఏమన్నాడు అంటే విధి చేతిలో మనం పనిముట్లం అన్నాడు. ఇంకో గంటలో ఏమి జరుగుతుందో మనం చెప్పలేము. ఎందుచేతనంటే ఎవ్విర్‌తింగ్ హేపెన్స్ ఇన్ ఇట్స్ ఓన్‌టైమ్. మనం చనిపోవటానికి కంగారు పడుతున్నాం అనుకోండి ఒక్క నిమిషం కూడా ముందు చావురాదు. ఇంకా ఎక్కువకాలం బతకాలి అన్నా ఆ శరీరం ఏ పని మీద వచ్చిందో ఆ పని పూర్తి అయిపోతే దైవసంకల్పాన్ని బట్టి ఒక్క క్షణం కూడా ఆగదు. రమణమహర్షిగారు చెప్పిన సిద్ధాంతం ఏమిటి అంటే ఆ విధి ఎంత విపరీతంగా ఉన్నా, విధి ఎవరికి? దేహానికి. చావు ఎవరికి? దేహానికి. పుట్టుక ఎవరికి? దేహానికి. పుట్టినదానికి ప్రారబ్ధం ఉంటుంది, పుట్టనిదానికి ప్రారబ్ధం ఉండదు. నీకు దేహభావన పోయి ఆత్మభావన కలిగితే విధి కూడా నిన్ను ఏమీ చేయలేదు. సంచితం, ఆగామి, ప్రారబ్ధం అని కర్మలు మూడు రకాలు. సంచితం అంటే నిలవలో ఉన్న కర్మ (గాదెలో

ఉన్న వడ్లు) రాబోయే పంట ఆగామి. ఇప్పుడు తినటానికి ఇంట్లో ఉన్న బియ్యం ప్రారబ్ధం. అంటే అది అనుభవించటానికి సిద్ధంగా ఉంది. నీకు ఆత్మానుభవం కలిగితే, బ్రాహ్మీస్థితి కలిగితే ఆగామి, సంచితం కూడా నశిస్తుంది, ప్రారబ్ధం అనుభవించాలి అని శాస్త్రం చెప్పింది. భగవాన్ ఏమని చెప్పారు అంటే ప్రారబ్ధం కూడా అనుభవించక్కరలేదు అన్నారు. ప్రారబ్ధం ఎవరికి? ప్రారబ్ధం దేహం అనుభవిస్తుంది. దేహము నేను అనే బుద్ధి నీకు పోయినప్పుడు ప్రారబ్ధం నిర్వీర్యం చేస్తుంది. మీ చేతిమీద కేన్సర్ వచ్చింది కదా అది ప్రారబ్ధం కాదా అని భగవాన్‌ని అడిగారు. రమణమహర్షిగారు ప్రారబ్ధం అనుభవిస్తున్నారు అని చూచేవాడు అనుకుంటున్నాడు. నేను అనుకోవటానికి ఇక్కడ నేను లేదుకదా. దేహగతమైన నేను ఉంటే వాడు అనుకుంటాడు. అలా అనుకునే నేను ఏనాడో పోయింది. ఇక్కడ ఉన్న నేను ఎవరో మీకు తెలియదు. చెప్పినా మీకు అర్థంకాదు అన్నారు భగవాన్. రామకృష్ణపరమహంస గారికి కంఠంలో కేన్సర్ వచ్చింది. ఆయన చివర రోజులలో మజ్జిగ కూడా మింగలేకపోయే వారు. మేము ఇంతమంది ఉన్నా మీకు మజ్జిగకూడా ఇవ్వలేకపోతున్నాం అని లాటూ అడిగితే, లాటూ ఇటువంటి నోర్లు కొన్ని లక్షల నోర్లు ఉన్నాయి. ఎన్నో నోర్లు మజ్జిగ తాగుతూ ఉంటే ఈ నోరే తాగాలని ఎక్కడ ఉంది. అది యూనివర్సల్ ఐ. అది విశ్వాత్మ. ఇండివిడ్యువల్ ఐ అక్కడ లేదు.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ. నువ్వు నన్ను ఒక్కడినే శరణు వేడుకో అన్నాడు పరమాత్మ. అది శరణాగతి మార్గం. ప్రహ్లాదుడిది శరణాగతి మార్గం. భగవంతుడి కోసం తల్లిదండ్రులని వదిలేసాడు. తల్లిదండ్రులని చూడటం ధర్మమే. నాకోసం నీ ధర్మాన్ని వదిలేసినా అందులో దోషం లేదు అన్నాడు. భగవంతుడు ఉన్నాడనే విశ్వాసం కనుక నీకు నూటికి నూరుపాళ్ళు కుదిరితే వాడికి మాత్రమే శరణాగతి మార్గం కుదురుతుంది. నాకు ఆ కోరిక నెరవేరలేదు, ఈ కోరిక నెరవేరలేదు, అది అలా ఉంటే బాగుండును, ఇది ఇలా ఉంటే బాగుండును అంటే వాడు శరణాగతి పొందలేదు అని అర్థం. ఈశ్వరుని సంకల్పమే తన సంకల్పం, ఈశ్వరుని ఇష్టమే తన ఇష్టం అనుకునేవాడు శరణాగతి పొందగలడు అన్ని మార్గాలు శరణాగతి మార్గంలో కలవాలి అని రమణమహర్షిగారు చెప్పారు. రమణమహర్షిగారిమీద ఒక అపవాదు ఉంది. ఆయన జ్ఞానమార్గం గురించే చెప్పారు, భక్తి మార్గం గురించి చెప్పలేదు అంటారు. నీకు శరణాగతిమార్గం కుదిరితే విచారణ అక్కరలేదు అని భగవాన్ చెప్పారు. భగవంతుడి నామస్మరణ కూడా ఆయనని ప్రేమించటానికి ఉపయోగపడుతుంది. విషయాల మీద నుంచి మనస్సుని వెనక్కి లాగమని పరమాత్మ చెప్పాడు. మా మనస్సు విషయాల మీద అలవాటు అయిపోయింది ఎంత లాగినా వెనక్కి రావటంలేదు అని చైతన్యుడిని అడిగితే పోనీ ఆ పద్ధతిని వదిలేసి కృష్ణుడి నామాన్ని స్మరించండి, కృష్ణుడి రూపాన్ని ధ్యానం చేయండి, ఆయన గుణకర్మలని శ్రవణం చేయండి. ఇంక మీ మనస్సు విషయాలమీదకు వెళ్ళదు,

పరమాత్మ దగ్గరపడి ఉంటుంది అని చైతన్యప్రభువు అన్నాడు. గృహస్థులు మీరు చెప్పిన మాటలు బాగానే వింటున్నారు. మీరు హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే, హరేరామ హరేరామ రామ రామ హరే హరే అని మీరు నామం చేస్తూ ఉంటే వాళ్ళు కూడా మీ వెనకాల నామం చేస్తున్నారు కానీ వీళ్ళు అభివృద్ధిలోకి వచ్చినట్టుకాని, శాంతిగా ఉన్నట్టుగాని ఏమీ కనబడటంలేదు అని శ్రీకృష్ణచైతన్యుడిని అడిగారు. చైతన్యుడు ఏమని చెప్పాడంటే ఒక కుండ ఉంది, దానికి పెద్ద బెజ్జం లేదు, చిన్న బెజ్జం ఉంది. నువ్వు కుండ నిండా నీళ్ళు పొయ్యి. చిన్న బెజ్జం అయినా రెండు మూడు రోజులలో నీళ్ళన్నీ కారిపోతాయి కదా. గృహస్థులకి నా బోధకూడా అలాగే ఉపయోగపడుతుంది అన్నాడు. వాళ్ళు శ్రద్ధగా వింటారు. కానీ దానిని నిగ్రహించుకోవటం, నేను చెప్పిన మాట కాపాడుకోవటం కష్టం అవుతుంది. అంటే గృహస్థాశ్రమంలో ఉండగా అసలు ఎవరూ తరించరు అనికాదు, కొద్దిమందే తరిస్తారు అని చెప్పటంకోసం అలా అన్నారు. శ్రీకృష్ణచైతన్య యొక్క ఇంద్రియనిగ్రహం ఎట్టిది అంటే ఆయన నాలుకమీద పంచదార వేస్తే ఒక్క పంచదార రేణువు కూడా తడి అవ్వదు. మళ్ళీ మీరు ఆ పంచదార తీసేసుకోవచ్చు వాడు శ్రీకృష్ణచైతన్యుడు.

ద్వైతం చాలా ప్రమాదం. నీకు అద్వైతానుభవం కలిగే వరకూ ద్వైతం నిన్ను వెంటాడుతుంది. అద్వైతానుభవాన్నే అమృతానుభవం అంటారు. ద్వైతం అంటే ద్వంద్వాలు. ఆ ద్వంద్వాలలో నువ్వు చిక్కుకోకు. గౌరవాలు, అగౌరవాలు, సంతోషాలు, దుఃఖాలు వీటిల్లో ఏమీ నువ్వు చిక్కుకోవద్దు. ఇవన్నీ బయటగొడవలు, నీ అంతఃకరణాన్ని నువ్వుపాడుచేసుకోకు. ఈ ద్వంద్వాలని కనుక జయిస్తే వాడు ఆత్మయందు స్థిరుడై ఉంటాడు, వాడికి స్థిరత్వం వస్తుంది. రామకృష్ణపరమహంస ఏమన్నాడు అంటే నువ్వు నిద్రపోతున్నావు నీకు చాలా స్వప్నాలు వస్తాయి. నువ్వు స్వప్నంలో ఉండగా స్వప్నం నిజం అనుకుంటున్నావా? అబద్ధం అనుకుంటున్నావా? కళ్ళు తెరిచేవరకూ స్వప్నం నిజమే. కళ్ళు తెరిచాక స్వప్నం నిజం కాదు అనుకుంటావు. అలాగే నీకు ఆత్మజ్ఞానం కలిగాక ఈ ప్రపంచం కూడా అంతే. ఇందులో ఉన్న నామ, రూపాలు చావులు, పుట్టుకలు, కష్టాలు, సుఖాలు ఇవన్నీ నీ మనస్సు కల్పితాలు అని తెలుస్తుంది. ఎక్సెప్ట్ గాడ్ ఎవ్విరితింగ్ ఈజ్ క్రియేటెడ్ బై ది మైండ్. నీకు జ్ఞానం కలిగాక ఉన్నది ఒక్కటంటే ఒక్కటే అనే అనుభవం వస్తుంది అప్పుడు ఏదీ నిన్ను చలింపజేయలేదు అన్నాడు రామకృష్ణుడు. సముద్రంలో నీరు ఎలా నిండుగా ఉంటుందో అలాగ పరమాత్మని పొందిన యోగి జ్ఞాన, విజ్ఞానములతోటి నిండి ఉంటాడు. మీరు బుద్ధితోటి గ్రహించిన శాస్త్రాన్ని జ్ఞానము అంటారు. అదే మీకు అనుభవంలోకి వస్తే అది విజ్ఞానమవుతుంది. సమతోష్టాస్మకాంచనః అంటే బ్రాహ్మీస్థితి పొందినవాడికి మట్టి, రాయి, బంగారము ఒకలాగే కనిపిస్తాయి అని. బ్రాహ్మీస్థితి పొందినవాడు మట్టికి, రాయికి, బంగారానికి వ్యత్యాసమే చూడడు. భార్యభర్తలు ఇద్దరూ ముసలివాళ్ళు అయిన తరువాత

తపస్సు చేసుకోవటానికి ఆశ్రమానికి బయలుదేరారు. వాళ్ళు ఏకాంతవాసంగా కొంతకాలం జీవించటంకోసం వెళుతున్నారు. ముందు భర్త తరువాత భార్య నడుస్తున్నారు. రోడ్డు పక్కన ఎవరిదో బంగారం పడిపోయింది. భర్త ఆ బంగారాన్ని చూసాడు. ఆ పక్కన ఉన్న మట్టి బంగారం మీద పడేసాడు. భర్త చేసిన పని భార్య చూసింది. దగ్గరకు వచ్చి మట్టి కప్పుతున్నారు ఏమిటి అని అడిగింది. అక్కడ బంగారం ఉంది, ఆ బంగారాన్ని చూచి నీకు మళ్ళీ ఆకర్షణ కలుగుతుందేమోనని నీకు కనపడకుండా మట్టి కప్పాను అన్నాడు. మట్టికంటే మీరు బంగారం ఎక్కువ అనుకుని నాకు దాని మీద ఆకర్షణ కలుగుతుంది అని పైన మట్టి కప్పారు. అంటే మీ ఉద్దేశ్యం ఏమిటి? మట్టి బంగారం సమానం కాదనేకదా. నాకు బంగారానికీ మట్టికీ తేడా లేదు. గీతలో చెప్పింది ఏమిటి? రెండూ సమానంగా కనపడాలి అని. కానీ మీకు ఇంకా సమబుద్ధి కలగలేదు. అందుచేత సాధన చేసినా సక్సెస్ అవ్వటం కష్టం అని చెప్పింది. ఈ శరీరం భూమి మీద తిరుగుతున్నప్పడే శరీరం లేని స్థితిని, ప్రపంచంలేని స్థితిని ఎవడైతే పొందాడో వాడు యోగి. వాడు ఆత్మజ్ఞాని. వాడికి మట్టి, రాయి, బంగారం ఈ మూడూ సమానంగా కనిపిస్తాయి.

మన దగ్గర పది రూపాయలు ఉన్నాయి అనుకోండి, మనకి అవసరం లేకపోతే చింపేయం. ఆ పది రూపాయలు అవసరం అయిన వాళ్ళకి ఉపయోగిస్తాము. కానీ రమణ మహర్షిగారు అరుణాచలం వచ్చి ఆయన జేబులో ఉన్న మిఠాయి, డబ్బులు అవి తీసి చెరువులో పడేసారు. లాగు తీసేసి చెరువులో పడేసారు. చొక్కాని రెండు ముక్కలు చేసి ఒక ముక్క చెర్లో పడేసారు. ఇంకో ముక్క గోచీ పెట్టుకున్నారు. సన్యాసి అయిపోయారు. మనం అయితే మనకి ఆకలి లేకపోతే లడ్డు ఎవరికో ఒకరికి ఇస్తాం తినమని. ఆయనకి అలా అనిపించలేదు. ఎందుచేతనంటే అక్కడ బాడీలెస్, మైండ్‌లెస్, వరల్డ్ లెస్, ఎవ్విరితింగ్ ఈజ్ లెస్. ఆ స్థితిలో ఆయన అన్నీ పడేసారు. ఆ స్థితి రాకుండా మీరు రోడ్డు మీద ఏమీ పడేయకండి. నేను చెప్పింది ప్రోపర్‌గా అర్థం చేసుకోండి. వారు శరీరం ఉన్నా చచ్చినవాడితోటి సమానం, ప్రపంచం ఉన్నా ప్రపంచం లేనివాడితోటి సమానం. విధి, ఆగామి, సంచితం వీటితోటి వారికి ఏమీ సంబంధం లేదు. అక్కడ వక్తిభావన లేదు. ఉన్నదేదో ఉన్నట్టు భగవాన్‌కి వ్యక్తమయ్యింది. ఈ శరీరం భూమిమీద తిరుగాడుతూ ఉండగానే మీరు ఆత్మానుభవం పొందాలి కాని చనిపోయిన తరువాత చేసేది ఏమీ లేదు. ఎందుచేతనంటే వాసనలు పునర్జన్మలను తీసుకువచ్చేస్తాయి. వాసనాక్షయం అవ్వకుండా మీకు శాంతి కలుగదు. వాసనాక్షయం అవ్వాలి.

ఈ రోజు సబ్జక్టు ఏమిటి అంటే బయటి గొడవలు అన్నీ బయట వదిలేయండి, లోపలికి ఏమీ తీసుకోకండి. మీరు ధైర్యంగా ఉండండి. మీరు శాంతిగా ఉండి మనస్సుని విషయాలలోంచి ఉపసంహరించి నన్నే చింతిస్తూ ఉంటే, నా అనుగ్రహం కోసం మీరు

పనిచేస్తూ ఉంటే, నన్ను ప్రేమిస్తూ ఉంటే, మీ మనస్సు నాచుట్టూ తిరుగుతూ ఉంటే అప్పుడు నా స్వరూపం పొందుతారు అన్నాడు పరమాత్మ. స్వార్థం లేకుండా పని చేయటం భగవంతుడిని ప్రేమించటం అంత తేలిక కాదు. అది చేసేటప్పుడు తెలుస్తుంది. గొయ్యి ఎంత లోతు ఉందో దిగితేనేగాని తెలియదు. మనం నిజంగా ప్రేమిస్తున్నామా లేకపోతే ప్రేమిస్తున్నట్టు నటిస్తున్నామా? మీరు చదువులు చదివేస్తే నామీద ప్రేమ కలుగుతుందా? అసలు మీ స్వభావం ఎలా ఉందో చూసుకోండి. మీ స్వభావాన్ని బట్టి మీరు మాట్లాడతారు, మీ స్వభావాన్ని బట్టి మీరు పనులు చేస్తారు, మీ స్వభావాన్ని బట్టి మీరు ప్రేమిస్తారు. ముందు ఆ స్వభావాన్ని మార్చుకోండి. విషయచింతన మన స్వభావం. దైవాన్ని చింతించటం మన స్వభావం కాదు. తేలు కుడుతుంది, పాము కరుస్తుంది అది దాని స్వభావం అలాగే విషయ చింతన మనకి స్వభావం. నువ్వు నీ స్వభావాన్ని మార్చుకుంటేగాని నన్ను ప్రేమించలేవు, నాకోసం పనిచేయలేవు, నీ మనస్సులో ఉన్న ఆలోచనలు నా చుట్టూ తిరగవు అంటున్నాడు పరమాత్మ. భగవద్గీతలో చెప్పిన విషయం మీరు ఆచరణలోనికి తెచ్చినప్పుడు అందులో ఉన్న కష్టం మీకు తెలుస్తుంది. అప్పటిదాకా మీకు తెలియదు. ఒకవేళ మీలో ఏమైనా దోషాలు, బలహీనతలు ఉన్నా మీరు కంగారుపడకండి, తొందరపడకండి. దేరీజ్ ఈశ్వర. పెద్ద గడ్డిమేటుకూడా చిన్న అగ్గిపుల్లవేస్తే తగులబడిపోతుంది. అలాగే మీలో ఎన్ని బలహీనతలు, ఎన్ని దోషాలు ఉన్నప్పటికీ నా అనుగ్రహం వలన అన్నీ పోతాయి. మీ హృదయంలో ఉన్న బండ రాళ్ళని బయటికి లాగిపడేసే వాడిని నేను ఉన్నాను. భరించేవాడిని నేను ఉండగా మీకు ఎందుకు భయం అంటున్నాడు పరమాత్మ.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-07-2012, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఏ పనులు ఎలా చేయాలి అని నేర్చుకొంటున్నాము అలాగే మన దేహం చనిపోయేటప్పుడు ఎలాగ చనిపోవాలి అనేది మనం నేర్చుకోవాలి. ఇప్పుడు మనం దేహంతో తాదాత్మ్యం పొందుతున్నాము, మనస్సుతో తాదాత్మ్యం పొందుతున్నాము, విషయాలతో తాదాత్మ్యం పొందుతున్నాము. అవన్నీ నిజాలుకాదు. దేహానికి చావు వచ్చే రోజుకైనా వాటితోటి తాదాత్మ్యం వదులుకోవాలి. మన శరీరాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకొన్నా అది ఏదోరోజున చనిపోతుంది. అది దాని స్వభావం. కాని మరణంలేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. అది ఒక్కటే నిజం, మిగిలినవన్నీ తలంపులే. చనిపోవటం నేర్చుకోవటం అంటే దేహం చనిపోయే రోజుకైనా ఈ చనిపోయే దేహం నేనుకాదు, మన హృదయంలో ఉన్న మరణంలేని వస్తువే నేను అని ఆ సద్వస్తువుతో మనకు తాదాత్మ్యం రావాలి, అదే నిజమైన మరణం, అదే కడసారి జన్మ. హృదయంలో ఉన్న మరణంలేని వస్తువుతో తాదాత్మ్యం పొందిన తరువాత నీ శరీరం చనిపోతూ ఉన్నా నేను చనిపోతున్నాను అనే భావన నీకు రాదు. ఇప్పుడు శరీరం ఉన్నప్పుడు